# ఓ యోధుడి ప్రస్థానం




Stv SANDESH

ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

## ఎమ్మెల్యే కోరుకంటి చందర్ జీవితం, పోరాటాల సమాహారం









# ఓ యోధుడి ప్రస్థానం

## ఎమ్మెల్యే కోరుకంటి చందర్
## జీవితం, పోరాటాల సమాహారం

ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

సందేశ్ మీడియా హౌజ్ ప్రచురణ

anil.sandeshtv@gmail.com, Phone: 93933 44405

# నిరంతర పోరాట వీరుడు..
# ప్రజల మనసెరిగిన నాయకుడు



ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్న చురుకైన యువ నాయకుడు. అంతకు మించి అలుపెరగని ప్రజా నాయకుడు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగం రాకపోవడంతో కుటుంబాన్ని నడిపేందుకు ఆటో నడపడానికీ వెనుకడుగు వేయలేదు. అలాగని అంతటితోనే ఆగిపోలేదు. కేబుల్ టీవీ నిర్వహించారు. రాజకీయాల్లోకి ఎంటరయ్యారు. అలుపెరగకుండా శ్రమించారు. ఏదయినా తనదైన ముద్ర కనిపించేలా చేశారు. అమ్మలకు పాదపూజ, ఉద్యమకారులకు సత్కారం, పడవల పోటీలు, బాలోత్సవ్.. ఇలా అన్న ఏది చేసినా తనదైన మార్క్ ప్రస్ఫుటంగా కనిపించింది. నూనూగు మీసాల నూత్నయవ్వనంలో పీపుల్స్‌వార్ పోస్టర్లు రాయడం, ఐటీఐ చేసే సమయంలో బోనగిరిలో నక్సల్‌ను సైకిల్‌పై తీసుకెళ్లడం, ఆఖరుకు మిత్రుడు సురేష్ సికాస చేతిలో హత్యకు గురైనపుడు రామగుండం బంద్ ప్రకటించడం.. ప్రతిదీ సంచలనమే. ఆఖరుకు ఎక్కువ కాలం దీక్షలో ఉండడం కూడా చందరన్నకే చెల్లు. నమ్ముకున్న రాజకీయ గురువు కోసం, నమ్మిన ప్రజల కోసం తనకేమవుతుందనేదీ లెక్క చేయక నిప్పుల్లో నడిచి ఆశ్చర్యానికి గురి చేశారు. చందర్ అన్న జీవితమెన్నడూ పూలపాన్పు కాలేదు. అనుకున్నది అనుకున్నట్టుగా అస్సలు జరగలేదు. అలాగని తాను ఎన్నడూ నిరుత్సాహపడలేదు. అలాగని పోరాటమూ ఆపలేదు. నిరంతరం ఫైట్ చేశారు. అనుక్షణం జాగరూకతతో ఉన్నారు. రాజకీయాల్లో నిలదొక్కుకోవడం, ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేయడం, కార్యకర్తలను వదలకుండా అంటిపెట్టుకుని ఉండడం, ప్రజల మనిషిగా పేరు తెచ్చుకోవడం.. ఇవన్నీ సామాన్యమైన అంశాలు కాదు. అందుకే అసామాన్యుడయ్యారు. అంతకుమించి అందరివాడయ్యాడు. ఎమ్మెల్యేగానే కాకుండా భార్య పేరిట ఏర్పాటు చేసిన విజయమ్మ ఫౌండేషన్ ద్వారానూ అజరామర సేవలందిస్తున్నారు. ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. నేను గోదావరిఖనిలో కోరుకంటి చందర్‌కు సంబంధించిన ప్రతులను జిరాక్స్ తీసుకునేందుకు వెళ్లినపుడు.. ఆ షాపతనితో మాటామాటా కలిపితే విషయం ఆరా తీశాడు. పుస్తకం రాస్తున్నామని చెప్పాను. ఆయన జిరాక్స్‌కు డబ్బులు కూడా తీసుకోలేదు. మా ఎమ్మెల్యే గురించి మంచి పని చేస్తున్నారు. నా వంతు కృషిగా డబ్బులు తీసుకోనంటూ చేతులు జోడించి నమస్కరించాడు. చందర్ వర్ధిల్లాలి. ఆయన సేవలు వర్ధిల్లాలి. రామగుండం ప్రజల గుండెల్లో యోధుడిగా చిరస్థాయిగా నిలిచిపోతారని గట్టిగా విశ్వసిస్తున్నా.

**- కుంట అనిల్ కుమార్**

**సందేశ్ మీడియా**



కాలేజీ కుర్రవాడ కులాసాగ తిరిగేటోడ.. విలాసాల బాట మరువరో ఓ విద్యార్థీ...విప్లవాల బాట నడువరో ఓ విద్యార్థి.. అంటూ భావోద్వేగంగా పాడుతున్నాడు ఓ విద్యార్థి. పెడతోవన పడుతున్న కాలేజీ కుర్రవాళ్ల పోకడలను హెచ్చరిస్తూ సాగే పాట అది. ఆ తరువాత సంభవామి యుగేయుగే.. అంటూ మరో అభ్యుదయ గీతం. ఆవేశంగా గొంతునుంచి బయటకు తన్నుకువస్తున్నది. గోదావరిఖని పట్టణం ఎల్బీనగర్‌లోని సీక్రెడ్ హార్ట్ హైస్కూల్‌లో ఉదయం అసెంబ్లీ రోజూ ఇలాంటి గీతాలతోనే సాగేది. చేతిలో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) సభ్యత్వ పుస్తకాలతో, సహ విద్యార్థులను ఆ యూనియన్‌లో చేర్పించడంలో బిజీగా కనిపించే ఆ విద్యార్థి అప్పుడు చదువుతున్నది ఏడో తరగతే. తెలిసిందల్లా.. ఒకటి చదువు, రెండోది అభ్యుదయం. అప్పుడు విప్లవపార్టీలకు ఆశ్రయమిచ్చే సింగరేణి ప్రాంతంలో అభ్యుదయ గీతాలాపన, ఎర్రజెండాల రెపరెపలు, పీపుల్స్‌వార్, సింగరేణి కార్మిక సమాఖ్య.. ఇలా రకరకాల విప్లవ సంఘాల పోస్టర్లు కనిపించడం అందరికీ నిత్యానుభవమే. కానీ, ఆ ఏడో తరగతి పిల్లాడు ఓ అడుగు ముందుకు వేసి, తెలిసోతెలియకో సికాస బంద్ పిలుపు పోస్టర్లు కూడా రాశాడు. పీపుల్స్‌వార్ నాయకుడు వడకాపురం చంద్రమౌళి ఉపన్యాసాలకు, ఆయన మీటింగుల్లో పాడే పాటలకు ప్రభావితమై వచ్చిన మార్పు ఇది. ఆ పిల్లగాడు ఉద్యమాలతోనే ఎదుగుతూ వచ్చాడు. అభ్యుదయాన్ని వీడకుండా ముందుకు నడిచాడు. ప్రజల కోసం ప్రజల మధ్యే ఉంటూ ప్రజానాయకుడయ్యాడు. ఆ నాయకుడే ప్రస్తుతం మన గోదావరిఖని నియోజకవర్గ ఎమ్మెల్యే. పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు.. కోరుకంటి చందర్.. ఆయన జీవితంలో అనేక ఆటుపోట్లున్నాయి. ఎత్తుపల్లాలున్నాయి. అనుదినం ఫైట్, స్ట్రగుల్ ఉన్నది. కుట్రలు, బురదజల్లే ఎత్తుగడలను దాటుకుంటూ నిజాయితీగా నిలబడిన తీరే ఆయన్ను ప్రజానాయకుడిగా నిలబెట్టింది. ప్రజల గొంతుకై అసెంబ్లీకి పంపింది.



సింగరేణి..
ఎటు చూసినా నల్ల బంగరు నేలలు..
కార్మికులతో కళకళలాడే గనుల దారులు..
శ్రమైక జీవన సౌందర్యం, విప్లవం, అభ్యుదయం..
నూతనత్వాన్నీ కోరుకునే చైతన్యవంతమైన ప్రాంతం అది.
ఒకప్పుడు.. పీపుల్స్‌వార్, సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస), న్యూడెమోక్రసీ..
ఎన్నెన్నో విప్లవపార్టీల ఉద్యమకారులు (నక్సలైట్లు),
వారి సానుభూతిపరులుగా అనేక మంది ప్రజలు..
దేన్నీ విడదీయలేనంతగా కొనసాగిన భావజాలం
గ్రామగ్రామాన మనుగడ సాగిన కాలం.
ఓ వైపు ఉద్యోగాలు లేవు.
ఎప్పుడో ఒకసారి నోటిఫికేషన్ వచ్చినా తెలంగాణ వారికి ఉద్యోగమే ఇవ్వరు.
మరోవైపు సానుభూతి పరులంటూ ప్రజలపై విరుచుకుపడే పోలీసులు,
ఎన్‌కౌంటర్ల పేరిట ఇరువైపులా మారణహోమాలు,
లాఠీ, తూటాల రాజ్యంగా మారిన తెలంగాణలో బతుకు వెళ్లదీసేది ఎలాగనే
ఆవేదన అందరిలో ఉండేది. ఆ ఆవేదనల నుంచి పుట్టిన ఉద్యమకారుడు
కోరుకంటి చందర్ అడుగడుగునా స్ట్రగుల్ అయ్యాడు. ప్రజల కోసం ఫైటర్‌గా
నిలబడ్డాడు. ఆయన జీవితంలోని కొన్ని ముఖ్యమైన అంశాలతో
రూపొందించినదే ఈ చిన్న పుస్తకం.
ఇదంతా ఆయన మాటల్లోనే..

మా ప్రాంతానికి చెందిన అత్యంత ప్రభావశీల పీపుల్స్‌వార్ నాయకుడు వడకాపురం చంద్రమౌళి. ఆయన మాటల ప్రభావమో, లేక బొగ్గుపొరలతో మమేకమైన చెమట చుక్కల జీవితాల ప్రభావమో.. నేను ఏడో తరగతిలోనే రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) సభ్యుడినయ్యాను. నా చేతుల్లో ఎప్పుడూ సభ్యత్వ నమోదు పుస్తకాలు కూడా ఉండేవి. చాలాసార్లు అభ్యుదయ, జాగృత గీతాలు పాడుకునేది. భారతదేశం భాగ్యసీమరా.. సకల సంపదలు కల్ల దేశమున దరిద్రమెట్లుందో మాయన్నల్లారా.. అనే పాట మమ్మల్ని చాలా కదిలించింది. దేశంలో అనేక వనరులున్నా పేదరిక నిర్మూలన ఎందుకు సాధ్యం కావడం లేదని, పాలకుల్లో ఎందుకు చిత్తశుద్ధి లేదనే ప్రశ్న, ఆవేదనతో కూడిన పాట అది. సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా.. సినబోయి కూచున్నవెందుకమ్మో.. అని పాడుకుంటూ మహిళల కష్టాలపై చలించిపోయేది. మా తిలక్‌నగర్ అంతటా దాదాపు అందరిలోనూ ఇదే భావన. అప్పట్లో లెక్కలేనన్ని ఎన్‌కౌంటర్లు జరిగాయి. అనేక మంది విప్లవ సంఘాల నాయకులు నేలకొరిగారు. వారి త్యాగంపై ఆవేదన పడుతుంటిమి. అదే ఆవేదన.. నేను తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా మారడానికి కారణంగా మారింది. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ)లో ఉండే రచయిత దయా నర్సింగ్ పాటలు నా ఉద్యమ జీవితానికి ప్రేరణగా నిలిచాయని చెప్పొచ్చు.





## సికాస బంద్ పోస్టర్లు..

మా చిన్నతనంలో.. సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) 48 రోజుల బంద్‌కు పిలుపునిచ్చింది. అప్పట్లో అదొక సంచలనం. సికాస సీవో (సెంట్రల్ ఆర్గనైజర్) నాతో పాటు మరికొందర్ని వచ్చికలవాలని మాకు పిలుపు వచ్చింది. తీరా వెళ్లాక బంద్ నేపథ్యంలో పోస్టర్లు రాయాలని అన్నడు. సీవో అంటే పెద్దన్న. ఆయన మమ్మల్ని గుర్తించి పిలవడమే గొప్ప కార్యం కింద లెక్క.అలాంటిది మమ్మల్ని పోస్టర్లు రాయాలని చెప్పడంతో ఉత్సాహంగా రాసినం. అప్పుడు బ్రష్‌లు అందుబాటులో లేవు. స్కెచ్‌లు కూడా కొనే పరిస్థితి లేదు. బీడీ తోకను విరిచి ఎరుపురంగుల ముంచి పోస్టర్లు రాయడం మొదలుపెట్టినం. చాలా గొప్ప పని చేస్తున్నమన్న భావన మాలో ఉండేది. ఆ మరుసటి రోజు మళ్లీ పిలిచారు. మాకొక ఐడెంటిటీ వచ్చిందన్న సంబరంతో వెళ్లాం. అవే పోస్టర్లను గోడలకు అతికించాలని పురమాయించిండ్రు. గోదావరిఖనిలోని ఓల్డ్ అశోక్ టాకీస్ ఏరియాలో ఆ పోస్టర్లు వేసినం. మేము చేస్తున్న పని ఎంత పెద్దదో, దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో ఎంతమాత్రమూ తెలియని వయసు అది. పోస్టర్ల విషయం దావానలంగా మారింది. పోలీసులు దర్యాప్తు చేశారు. అదృష్టవశాత్తూ మమ్మల్ని ఎవరూ ఐడెంటిఫై చేయలేదు. పరిస్థితి ఎంత తీవ్రమైనదో తెలిసిన తర్వాత చాలా టెన్షన్ పడ్డాం. ఇంకోసారి ఇలాంటి పని చేయొద్దని నిర్ణయించుకున్నం. చిన్నపిల్లలు ఆ పని చేయడం వల్ల అందరికీ సేఫ్ అనుకుని భావించి సీవో ఆ పని మాతో చేయించి ఉండవచ్చని తర్వాత మాకు అర్థమైంది.

## సీవోతో జనసభకు..

నేను, నా కొందరు స్నేహితులతో కలిసి బోనగిరిలో ఐటీఐ చేశాను. బెల్లంపల్లికి చెందిన సత్యం అప్పుడు ఆలేరు దళ కమాండర్‌గా ఉన్నారు. ఐటీఐ విద్యార్థుల గదులే వారికి షెల్టర్‌గా ఉండేది. ఓ రోజు బోనగిరిలో జనసభ పేరుతో కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు నిర్బంధం విధించారు. ఎవరూ అక్కడికి వెళ్లకుండా చూడాలనేది పోలీసుల పట్టుదల. బాలరాజు అనే సెంట్రల్ ఆర్గనైజర్ (సీవో) ఆ కార్యక్రమానికి వెళ్లాలి. తమ్ముడూ నన్ను తీసుకెళ్తావా అని అడగడంతో నేను సైకిల్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లాను. అప్పుడేమీ అనిపించలేదు. తర్వాత పేపర్లలో ఆ కార్యక్రమం గురించి చదివిన తర్వాత.. ఎంత ప్రమాదకరమైన చర్యనో తెలిసివచ్చింది.

ఐటీఐ తర్వాత నేను, మా ఫ్రెండ్స్ రామగుండం పోయినం. సికాస, జనరక్షణ, ప్రజాసేవ పార్టీ.. ఒక్కొక్కరు తలా ఒక పార్టీతో మమేకమయ్యారు. మా ఫ్రెండ్స్ గ్యాంగ్ యూనిటీ ఎక్కువ. కొంత గూండాయిజం కూడా ఉంటుండె. ఇక ఆ పనులేవీ వద్దనుకున్నం. ఎర్రజెండాల నీడన నక్సలైట్లం కావొద్దని బలంగా నిర్ణయించుకుని మా దారి మార్చుకున్నం.

## సురేష్‌తో ఎర్రజెండాల ఎపిసోడ్ బంద్

ఇకపై మంచిగా ఉండాలనుకుని 11 మంది దోస్తులం అయ్యప్ప దీక్ష తీసుకున్నం. అందరం కలిసే పూజ, భిక్ష చేసేవాళ్లం. మా పదకొండు మందిలో ఒకడు సురేష్. పోలీస్ ఇన్ఫార్మర్‌గా ముద్ర పడినవాడు. ఆవేశమెక్కువ. ఎప్పుడూ వెపన్ ఉండేది. పద్ధతి మార్చుకోవాలని సికాస వాళ్లు వార్నింగ్ ఇచ్చారు. సురేష్‌కు





ఓ గర్ల్‌ఫ్రెండ్ ఉంటుండె. అయ్యప్ప దీక్షలో ఉన్నపుడు కూడా ఆమెను చూసి వస్తుండె. దీక్షలో ఉన్నపుడు అట్లా పోవద్దని హెచ్చరించినం. సరే అన్నడు. ఓ రోజు వేములవాడ, కొండగట్టు పోయి వచ్చినం. రమణ అనే మిత్రుడు వచ్చి వెళ్లాడని అమ్మ చెప్పగానే అదే రోజు సాయంత్రం రమణ ఇంటికి వెళ్దామని బయల్దేరినం. సురేష్ రానని చెప్పిండు. సురేష్‌ను వదిలి మేం అర కిలోమీటర్ దూరం వెళ్లగానే.. సురేష్ తన లవర్ ఇంటికి పోయిండు. అప్పుడే ఫైరింగ్ జరిగింది. విషయం తెలిసి.. దీక్షలో ఉన్న సురేష్ ఎవరినయినా షూట్ చేసిండా అని కంగారు పడినం. పరుగుపరుగున వెళ్లి చూస్తే.. అంతా రివర్స్. అచేతన స్థితిలో సురేష్. సికాస మనుషులు తుపాకులతో తొమ్మిది రౌండ్లు కాల్పులు జరిపిండ్రు. ఇదంతా వాడి గర్ల్‌ఫ్రెండ్ ఇంట్లోనే జరిగింది. ఆస్పత్రికి తీసుకెళితే అప్పటికే చనిపోయిండని డాక్టర్లు డిక్లేర్ చేసిండ్రు. మరుసటి రోజు గోదావరిఖని ఏరియా బంద్‌కు పిలుపునిచ్చినం. నక్సలైట్ల చర్యలకు నిరసనగా. అందరూ స్వచ్ఛందంగా తమ సంస్థలను, దుకాణాలను మూసివేశారు. అప్పటిదాకా నక్సల్స్, సికాస బంద్ పిలుపునిస్తుండె.. కానీ వారికి వ్యతిరేకంగా నిర్వహించిన మొట్టమొదటి బంద్ అది.

## డిపెండెంట్ ఉద్యోగం లేక ఆటో డ్రైవర్‌గా..

నాకు ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్లు. నాన్న సింగరేణి ఉద్యోగి.

## మేన మరదలే నా భార్య.. మంచి ఫ్రెండ్ కూడా..

నా భార్య విజయ.. నా మేన మేరదలు మాత్రమే కాదు.. చిన్నప్పటి నుంచి మంచి ఫ్రెండ్‌లా ఉండేది. ఆమెనే నా భార్య అని చిన్నప్పటి నుంచే ఇరు కుటుంబాల వాళ్లు అంటుండేవారు. మేమిద్దరం ఎప్పుడూ చాలా జోవియల్‌గానే ఉండేవాళ్లం. నా ఇరవయ్యొక్కటో ఏట మా పెళ్లయింది. 2014లో మా కూతురు ఉజ్వల పెళ్లి చేసినం. మైనింగ్‌లో డిప్లొమా చేసిన నా మేనల్లుడు ఇప్పుడు మా ఇంటి అల్లుడయ్యాడు. 2022లో మా కొడుకు పెళ్లి అయింది.

నేను తక్కువ టైమ్‌లో మంచి పేరు తెచ్చుకోవడానికి రెండు కారణాలు. ఒకటి ప్రజల్లో ఉండడం, హార్డ్ వర్క్, రెండోది నా భార్య విజయ. నేను ఇంట్లో ఉండడం లేదని ఎన్నడూ గొడవ చేయలేదు. ఏ సందర్భమైనా, ఇంటికి ఎంత మంది వచ్చినా భోజనం వండిపెట్టడానికి వెనుకాడలేదు. ఆమె నాకు మరదలు కావడమే కాకుండా, చిన్నప్పటి నుంచి ఫ్రెండ్ కావడమే ఇందుకు కారణమేమో. నా మనోభావాలకు అనుగుణంగా ఉండే భార్య దొరకడం నా అదృష్టమే. నా ప్రమేయం లేకుండా, నా కోసం చూడకుండా తనే మా ఇంటికి సంబంధించిన అన్ని విషయాలూ చూసుకునేది. మా అమ్మానాన్నలు కూడా మా ఇద్దర్నీ చిన్నపిల్లల్ని చూసినట్టే చూసుకునేవాళ్లు. ఇప్పుడు మా పిల్లలు కూడా అలాగే సపోర్టివ్‌గా ఉన్నారు. అది నాకు చాలా ప్లస్ పాయింట్.




రోజూ సైకిల్‌పై గనికి వెళ్లేవాడు. ఇల్లు, ఉద్యోగం తప్ప ఇతర విషయాలేవీ పట్టించుకునేవాడు కాదు. ఆఖరుకు ఇంటి పక్కన ఎవరున్నారో కూడా తెలియదు మా నాన్నకు. అమ్మ గృహిణి. అతి కష్టమ్మీద ఎలాగోలా మా అందరి పెళ్లిళ్లు చేసిండు నాన్న. 1993లో మేన మరదలు విజయతో నా పెళ్లయితే అయింది కానీ, ఉద్యోగమే లేదు. సింగరేణిలో వీఆర్ఎస్ తీసుకుంటే వారసులకు ఉద్యోగమిచ్చే ప్రక్రియ అప్పుడు ఉండేది. అదే భరోసాతో ఐటీఐ (ఎలక్ట్రీషియన్), అప్రెంటిస్ పూర్తి చేశాను. ఎందుకైనా మంచిదని ఇంటర్ కూడా చదివాను. కానీ డిపెండెంట్ ఉద్యోగమిచ్చే విధానాన్ని సింగరేణిలో అప్పుడే రద్దు చేశారు. ఉద్యోగం వచ్చే అవకాశం లేదు, సంపాదన అసలే లేదు. ఖర్చులకోసం నాన్ననే అడగాల్సి వచ్చేది. పెళ్లయ్యాక కూడా పైసలడుగుడు ఏందని ఆటో నడపాలని నిర్ణయం తీసుకున్నా. మా ప్రాంతంలో డబ్బులు సంపాదించడానికి సులువైన మార్గం ఆటో నడపడమే. సొంతంగా కొనక్కరలేదు, కిరాయికి తీసుకుని కూడా నడపొచ్చు. అది కాకుండా వేరే పనేదీ దొరకకపోయేది. ఎన్‌టీపీసీలో ఉద్యోగం దొరికే పరిస్థితి లేదు. కాంట్రాక్టు లేబర్‌గా చేద్దామన్నా ఎక్కడా అవకాశం లేదు. ఓ మూడు నెలలు ఆటో నడిపాక అనుకోకుండా కేబుల్ టీవీ చేతికొచ్చింది. ఒకరు డిష్ కనెక్షన్లను అమ్మితే కొనుక్కున్నాం. అప్పటి నుంచి పైసలకు ఇబ్బంది లేకుండా సాగింది.

## నాకు దేవుడిచ్చిన అన్న ఈశ్వరన్న

నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాతి స్థానం రాజకీయ గురువు కేసీఆర్‌దే. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని ఉవ్వెత్తున రగిలించడమే కాదు, రాష్ట్రాన్ని సాధించి ఇప్పుడు అభివృద్ధి బాటలో పరుగులు పెట్టిస్తున్న విజనరీ ఆయన. ఆ తరువాత స్థానం కొప్పుల ఈశ్వరన్నది. దేవుడిచ్చిన అన్న ఆయన.

1994లో ఈశ్వరన్న తెలుగుదేశం పార్టీలో ఉన్నడు. అప్పుడు మేడారం నియోజకవర్గంగా ఉన్న మా ప్రాంతం నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నం చేసిండు. ఈశ్వరన్న వెంట ఉండాలని అనుకున్నం. నిఖార్సయిన నాయకుడాయన. మంచి మనస్తత్వం. ఆదర్శ వివాహం చేసుకున్నడు. ఈశ్వరన్న కుటుంబం, మా కుటుంబం చాలా చనువుగా ఉండేది. అన్న కష్టసుఖాల్లో నేను, నా స్నేహితులు కూడా ఉండడం ఆరంభమయింది. అన్న వల్లనే నేను ఫుల్‌టైమ్ రాజకీయ నాయకుడిగా మారాను. టీడీపీ విద్యార్థి విభాగంలో రామగుండం నోటిఫైడ్ ఏరియా టౌన్ ప్రెసిడెంట్‌గా నాలుగైదేండ్లు పని చేశాను. తర్వాత తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్‌నయ్యాను. 1999లో ఈశ్వరన్నకు టీడీపీ టిక్కెట్ దక్కలేదు. చాలా ఇబ్బంది పడ్డడు. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పార్టీలో చేరుదాం తమ్ముడూ అన్నడు. ఉద్యమంలో పని చేసినట్లుంటది. తర్వాత అవకాశం కూడా వస్తది కదా.. అని నచ్చచెప్పిండు. అప్పటికే



ఈశ్వరన్న రెండుసార్లు ఓడిపోయిండు. అన్న వెంట వచ్చేందుకు ఎవరూ ఉత్సాహం చూపలే. అన్నతో ఉండడమే ముఖ్యమనుకుని నేను రెండో ఆలోచనే లేకుండా వెంట నడిచాను. అన్న ఎమ్మెల్యే కావాలన్నది నా కోరిక. టీఆర్ఎస్‌లో చేరాక.. టీడీపీ ప్రభుత్వం అన్నపై కేసులు పెట్టి జైలుకు పంపింది. నక్సలైట్లకు ఆశ్రయమిస్తున్నాడనేది ఆయనపై మోపిన ఆరోపణ. ఈశ్వరన్నను రాజకీయంగా అణగదొక్కడమే టీడీపీ ఉద్దేశ్యం. జైలుకు పోయి ఈశ్వరన్నను పరామర్శించి, అన్నతోని ఓ ఫొటో తీసుకుని పోస్టర్లు ప్రింట్ చేయించాను. గోదావరిఖని అంతా పోస్టర్లు వేయించినం. మా నాయకుడు ఎలా ఉన్నడో పబ్లిక్‌కు తెలిసేలా చేశాను.

టీఆర్ఎస్‌లో చేరాక పార్టీ యువజన విభాగం స్టేట్ జనరల్ సెక్రటరీగా ఎంపిక చేశారు. ఆదిలాబాద్ జిల్లా యువజన విభాగం ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. 2004లో ఈశ్వరన్న మేడారం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచాక నాకు కౌన్సిలర్‌గా పోటీ చేసే అవకాశం వచ్చింది. గెలిచి టీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌నయిన. 2007లో.. ఈశ్వరన్న నాయకత్వంలో రామగుండం ప్రాంతానికి మళ్లీ వెలుగు రావాలని పాదయాత్ర చేశాం. ఎన్టీపీసీ, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)ను పునరుద్ధరించాలనేది మా పాదయాత్ర డిమాండ్.

2009లో డీలిమిటేషన్ కావడంతో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా ఉన్నది కాస్తా రామగుండం నియోజకవర్గంగా మారి జనరల్ అయింది. ఈశ్వరన్న సపోర్ట్‌తో నాకు పోటీ చేసే అవకాశం వచ్చింది. కేసీఆర్ గారు కూడా పట్టుబట్టి మహాకూటమి అభ్యర్థిగా నన్ను నిలబెట్టారు.

## ఫ్రెండ్సంటే ప్రాణం

నాకు స్నేహితులంటే ప్రాణం. చిన్నపుడు మేం ఐదుగురం జిగిరీ దోస్తులం. వాళ్ల పేర్లను నా చేతిమీద పచ్చ పొడిపించుకున్నా. కాస్త పెద్దయ్యాక 13 మంది అయ్యారు. ఇప్పుడు 50 మంది ఫ్రెండ్స్ ఉన్నారు. అయినా.. చిన్నప్పటి ఐదుగురమే ఎక్కువగా టచ్‌లో ఉంటాం. ఒకే కుటుంబంలా ఉంటాం. అయితే.. వాళ్లెవరూ ఎమ్మెల్యేగా నేను తీసుకునే నిర్ణయాల్లో జోక్యం చేసుకోరు. చేసుకోనివ్వను కూడా.

అదే అలవాటు ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ ప్రతీరోజు 18 గంటలు ప్రజలతో ఉండేందుకే








ఇష్టపడతాను. ప్రతీరోజు ఉదయం 7 గంటలకే ప్రజలతో నా దినచర్య ప్రారంభమవుతుందన్నది అందరికీ తెలిసిన విషయమే. సాధారణంగా పొద్దున్నే పట్టణంలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటాను. ఎవరు ఏ కార్యక్రమానికి పిలిచినా, సమస్యలున్నాయని కలిసినా అక్కడికి స్వయంగా వెళ్లి, పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకుంటా. గ్రామాల్లో సమస్యలు తెలుసుకునేందుకు తరచుగా పల్లెల్లో నిద్ర చేస్తున్నా.

## 18వేల ఇళ్లకు పట్టాలిచ్చినం

సింగరేణి పరిధిలో ఇళ్లు కట్టుకున్న వారందరికీ ఇంటి పన్ను ఉంటుంది కానీ, అమ్మడానికి, కొనడానికి వీలుండదు. హక్కును చూపించే పట్టా అసలే ఉండదు. అంటే.. చట్టం ప్రకారం అనధికార ఇళ్లన్నమాట. ఎన్నేళ్లున్నా సొంతింటి భావనే ఉండకపోయేది. నేను మున్సిపల్ కార్పొరేటర్‌గా, ఫ్లోర్ లీడర్‌గా ఉన్నపుడు ఈశ్వరన్నతో కలిసి వారి కోసం పోరాటం చేశా. మొత్తంగా 18వేల ఇళ్లకు సంబంధించి పట్టాలిప్పిచ్చిన.

## జీవితం ప్రజల కోసమే..

నేనెప్పుడూ ప్రజల మధ్య ఉండేందుకే ఇష్టపడతా. తెలంగాణ ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచి గులాబీజెండా పట్టుకుని గ్రామగ్రామాన, వాడవాడలా తిరుగుతున్నా. అలాగే ప్రజా అంకితయాత్ర పేరుతో మరో కార్యక్రమాన్ని తీసుకున్నాం. టీఆర్‌ఎస్‌లో ఉంటూ, ఉద్యమకారుడిగా ఏమేం చేశామో ప్రజలకు గుర్తు చేసేందుకు చేపట్టిన కార్యక్రమం అది. ఊరూరా ఘనమైన స్వాగతం లభిస్తున్నది. వాడవాడలా ప్రజలు ఆదరిస్తున్నరు. ఆరు గ్రామాల్లో పల్లెనిద్ర చేసినం. రాత్రికి ఒక ఊరికి వెళ్లి కార్యకర్తలతో సమావేశమై సమస్యలు తెలుసుకోవడం, ఉదయమే గ్రామాన్ని సందర్శించడం, అధికారులతో సమావేశమై పరిష్కారానికి సూచించడం.. గతంలో పెండింగ్‌లో ఉన్నవి ఎంతవరకు పూర్తి చేశారో అడగడం.. ఇలా ప్రజలతో ఉండే కార్యక్రమాలు చాలానే చేసినం. 2010లో 48 కిలోమీటర్ల పాదయాత్ర చేసినం.





## కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్

2009లో మహాకూటమి ఏర్పడడానికి ముందు.. కేసీఆర్ సార్ సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. గోదావరిఖని మీదుగా సార్ సిర్పూర్ కాగజ్‌నగర్‌కు వెళ్తున్నరు. నేనప్పుడు టీఆర్ఎస్ యువజన విభాగం జనరల్ సెక్రటరీని. కౌన్సిలర్‌ను కూడా. గోదావరిఖని అంతటా కేసీఆర్‌కు వెల్‌కమ్ చెబుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినం. 150 మంది యువకులతో 'తెలంగాణ యువకులం.. కేసీఆర్ వారసులం" అనే నినాదంతో ఉన్న టీషర్ట్ వేసుకుని పది టాటాసుమో వాహనాలతో సార్‌కు బ్రహ్మాండంగా వెల్‌కమ్ చెప్పినం. బస్సుయాత్రకు ఎస్కార్ట్‌లాగా మా సుమోలలో వెంట కదిలినం. ఇదంతా చూశాక.. మా ప్రాంతానికి చెందిన పెద్ద లీడర్లతోని సార్ నాకు కబురు పంపింద్రు. రేపు పొద్దున న్యూస్ కవరేజ్ చేసిన పేపర్లన్నింటిని తీసుకుని రమ్మన్నారు. నేను వెళ్లిన. "చందర్ నువ్ మంచిగ వర్కవుట్ జెయ్యాలె.. మంచిర్యాలలో సభ ఉంటుంది మనకు. రామగుండంల ఉన్నోళ్లందరినీ నువ్వే తీసుకురావాలె. మంచిగ జేసుకో" అని కేసీఆర్ సార్ చెప్పిండు. అంటే.. పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని గ్రీన్‌సిగ్నల్ అది. సార్ చెప్పినట్టే ఫాలో చేసుకుంటూ వచ్చిన.

## రెబల్‌గా సోమారపు..

మహాకూటమి ఏర్పడింది. టీఆర్ఎస్, టీడీపీ అలయెన్స్.. టికెట్ విషయమై ఇరుపార్టీల మధ్య పేచీ వచ్చింది. కేసీఆర్ సార్







నా పేరు ప్రపోజ్ చేశారు. చందర్ మొదట్నుంచి పనిచేస్తుండు. ఆయనకే టికెట్ ఇవ్వాలని పట్టుబట్టిండు. చంద్రబాబు కూడా పట్టుదలతో ఉన్నడు టికెట్ విషయంలో. అప్పటిదాకా మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సోమారపు సత్యనారాయణకు టీడీపీ తరపున టికెట్ ఇవ్వాలనేది ఆ పార్టీ ఆలోచన. చివరకు టీఆర్ఎస్‌కు కేటాయించిన 42 స్థానాల్లో రామగుండం ఒకటి. నాకు అవకాశం ఇచ్చారు. సోమారపు సత్యనారాయణ తెలుగుదేశం నుంచి రెబల్‌గా పోటీ చేసిండు.. మహాకూటమిలో ఉన్న మిగతా పార్టీలు కూడా ఆయనకే అనుకూలంగా పనిచేశాయి. అప్పటికే ఆయన మున్సిపల్ చైర్మన్. ప్రజల్లో పలుకుబడి ఉంది. నేను కౌన్సిలర్‌ను మాత్రమే. ఆరువేల తేడాతో సత్యనారాయణ గెలిచిండు. తర్వాత 2013లో ఆయనే టీఆర్ఎస్‌లో చేరిండు.

## పీడీయాక్ట్ కేసు పెట్టాలని..

గోదావరిఖనిలో యూత్ ఎక్కువ. కాలేజీల్లో విద్యార్థులతో అనుసంధానమయ్యే వాళ్లం. అందుకే ఏ కార్యక్రమం చేసినా విజయవంతమయ్యేది. అప్పట్లో తెలంగాణ ఉద్యమానికి సంబంధించి ఏ వార్త వచ్చినా.. మొదటిది గోదావరిఖని నుంచే. టీవీలో స్క్రోలింగ్ కూడా మాదే మొదలు. దీంతో పోలీసుల నిర్బంధం మామీద ఎక్కువయింది. ముందస్తుగా అరెస్టు చేసేవారు. టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సంఖ్య చాలా తక్కువ. పోలీసులు మమ్మల్ని చాలా భయపెట్టేవాళ్లు. విద్యార్థులు, కార్యకర్తలు.. అందరూ జైలు, కేసులంటే చాలా భయపడేవారు. అందరికీ బెయిలు యిప్పించి బయటకు తీసుకురావడమనేది ఆర్థికంగా తలకుమించిన భారమయ్యేది. కోట్లలో ఖర్చయ్యేది. అంత డబ్బు మొబిలైజ్ చేయడమనేది అసాధ్యమైన ముచ్చట. మా అవస్థను గమనించిన అడ్వకేట్లందరూ ఫీజు తీసుకోకుండా సేవలందించారు. అయితే, ప్రతి బెయిల్‌కు ఐదు వేల రూపాయలు డిపాజిట్ చేయాల్సి వచ్చేది. వాటికీ తిప్పలే. సింగరేణి ఉద్యోగులను ష్యూరిటీగా పెట్టేవాళ్లం. కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉన్నారు కాబట్టి.. దాదాపు ప్రతీ ఒక్కరు ఎవరో ఒక ఉద్యమకారుడికి ష్యూరిటీ యిచ్చారు.

## బస్సుకు నిప్పు

ఓ రోజు అందరం మా ఇంట్లో భోజనం చేస్తున్నం. నిరాహారదీక్ష చేస్తున్న కేసీఆర్ గారిని ఖమ్మం ఆస్పత్రికి





బలవంతంగా తరలించిండ్రు. ఆఖరుకు కేటీఆర్‌ను కూడా కేసీఆర్‌ను చూసేందుకు అనుమతిస్తలేరు. ఇదంతా మేం టీవీలో చూస్తున్నం. ఆస్పత్రి దగ్గరికే ఎవ్వరినీ రానిస్తలేరు. మాకు కోపం వచ్చింది. నా వెంట ఉండే తమ్ముడు శ్రీనును ఫోన్ చేసి రమ్మని చెప్పిన. బైక్‌పై బయటకు వెళ్లి ఓ దగ్గర కిరోసిన్, పెట్రోల్ అమ్ముతుంటే తీసుకుని రాత్రి 11 గంటలకు రోడ్డుపైకి వెళ్లినం. బస్సును దగ్ధం చేయడం ద్వారా ఇంటెన్సిటీ ఎట్లున్నదో ప్రభుత్వానికి తెలిసేలా చేయాలి. అంత అగ్రెసివ్‌గా ఉండేవాళ్లం ఆ సమయంలో.. అసలు ఆ టైమ్‌లో మాకు ఏమవుతుంది? కుటుంబం పరిస్థితి ఏంది? మా భవిష్యత్తు ఎలా ఉంటుంది ? అసలు ఆ ఆలోచనలే ఉండేవి కావు. ఎన్ని కేసులు నమోదవుతున్నా పట్టించుకోకపోయేది. అలా మొత్తమ్మీద నాపై 135 కేసులు నమోదయ్యాయి. వీటిలో 35 నాన్‌బెయిలబుల్. రైలురోకో కేసు పెద్దది. ఆరుసార్లు జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఆఖరుకు పీడీ యాక్టు కూడా నమోదైంది. నా కేసుల రద్దు కోసం ఆఖరుకు కేసీఆర్ గారు కూడా తిరగాల్సి వచ్చింది.

## నేనక్కడ లేకపోయినా నాపై కేసు

ఓసారి మా మిత్రులు రైలు పట్టాలను తొలగించిండ్రు.





అప్పుడున్న సీఐ, డీఎస్పీ.. అక్కడ నేను లేకపోయినా పరోక్షంగా ఉన్నామని నా మీద కేసులు నమోదు చేసింర్రు. ఆ తర్వాత.. ఎస్పీ, డీఎస్పీ.. అందరూ మా దగ్గరికొచ్చి పీడీయాక్ట్ నమోదు చేయాలని చూసింర్రు. పీడీయాక్ట్ అంటే జీవితకాలం జైలులో ఉంచాలె. గవర్నమెంట్‌కు ఎప్పుడు రిలీజ్ చేయాలనిపిస్తే అప్పుడు రిలీజ్ చేస్తది అంతే. ఆ పరిస్థితి కూడా తీసుకువచ్చింర్రు.

## ఎవరికీ లేని పట్టి నీకెందుకన్నడు డీఎస్పీ

ఉద్యమ సమయంలో గోదావరిఖనిలో డీఎస్పీ



ఉదయ్‌కుమార్ రెడ్డి గారున్నరు.. ఆయన నన్ను పిలిపించుకుని 'చందర్.. మీరెందుకు ఇంత ర్యాష్‌గా మూమెంట్ చేస్తున్నరు. మీరు ఎమ్మెల్యేగా పోటీ చేసినవారు. తెలంగాణ కోసం ఏమైనా హరీశ్‌రావు మీద కేసులైనయా? వాళ్లేమైనా బస్సులు కాలబెట్టింర్రా.. ఇన్ని కేసులు నమోదయినయా వాళ్ల మీద? 119 నియోజకవర్గాల్లో ఎక్కడా, ఎవరి మీదా లేనన్ని కేసులు నీ మీద ఎందుకయినయ్. ఇంకో నాలుగైదు కేసులయితే.. రేపు నిన్నూ నగర బహిష్కరణ చేయాల్సి వస్తది. ఊరిలోకి రానివ్వకుంట చేస్తరు. ఎమ్మెల్యే గావాల్సిన వ్యక్తి ఇలా చేసుడేంది? అన్నడు. ఆయన నా మంచి కోసమే చెప్పిండు కానీ... తెలంగాణ ఉద్యమంలో ఎందరో ఆత్మబలిదానం చేసుకున్నరు. వారి ముందు మేం చేసినదేదీ పెద్దది కాదు. ఎమ్మెల్యేగా పోటీ చేసుడూ గొప్పది కాదు. భవిష్యత్తు తరాలైనా బాగుంటయ్.. అన్నాన్నేను. పరేషాన్ అయిండు ఆ డీఎస్పీ. నిజానికి ఆ ఏజ్‌లో మాకు మా కుటుంబసభ్యులు, మిత్రులు సహకరించడమనేది చాలా గొప్ప విషయం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకపోతే మా వ్యక్తిగత జీవితాలు చాలా డిస్టర్బ్ అయ్యేవి. 2009లో ఓ పోలీసు ఉన్నతాధికారి... తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయితే నక్సలైట్లు తిరిగి వస్తారని అన్నడు. దీనికి కౌంటర్‌గా నేనొక సమావేశం ఏర్పాటు చేశాను. తెలంగాణ ఉద్యమాన్ని అణగదొక్కడం వల్లే అనేక మంది



యువతీయువకులు నక్సలైట్లుగా మారారు. ఇప్పుడు కూడా మన రాష్ట్రం మనకు రాకపోతే నక్సలైట్లలో మరింత మంది చేరుతారు. నేను ఈ వేదిక నుంచే ప్రకటిస్తున్నా.. తెలంగాణ రాకపోతే నేను కూడా నక్సలైట్లలో చేరుతా. రాష్ట్రం వస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా.. అని ప్రకటించాను. ఇలాంటి ప్రకటన చేస్తే మరిన్ని ఇబ్బందులొస్తాయి.. ఇంకోసారి అలా ప్రకటించొద్దని ఆ డీఎస్పీ సూచించారు.

## సంక్రాంతి రోజు మా కుటుంబ దీక్ష

2010 సంవత్సరం.. సంక్రాంతి పండుగ వచ్చింది. అప్పటికే నిరాహార దీక్షలు కంటిన్యూ చేస్తున్నం. ఏ రోజు ఎవరెవరు దీక్షలో కూర్చోవాలో జాబితా ప్రిపేర్ చేసి వాళ్లను పిలిచేవాళ్లం. పండగ సెలవులకని మా పిల్లలు హాస్టల్ నుంచి ఇంటికొచ్చారు. అయితే లిస్ట్ ప్రకారం పండగ రోజు దీక్షలో ఉండాల్సిన వాళ్లు.. పండగ కదా అన్నా అని తటపటాయించారు.



వెంటనే మా పిల్లలు ముందుకు వచ్చి డాడీ... రేపు మనమే దీక్షలో ఉందాం అన్నారు. పిల్లల నిర్ణయానికి నేను చాలా ఆశ్చర్యపోయాను. ఉద్యమంలో నాకు దొరికిన గొప్ప సపోర్ట్లలో అదీ ఒకటి. అంతే.. నేను అప్పటికప్పుడే ప్రకటన చేశాను. తెలంగాణ రాష్ట్రం వచ్చాకే సంక్రాంతి పండుగ చేసుకుంటామని. విజయ, నేను, మా పిల్లలు ఉజ్వల, మణిదీప్.. నిరాహారదీక్షలో కూర్చున్నాం. గోదావరిఖని సిటీకేబుల్ చానల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. అప్పుడు రోజూ లైవ్ టెలికాస్ట్ చేసేవారు ఉద్యమాన్ని. మేం దీక్షలో కూర్చున్నామని టీవీలో చూసి దీక్షా వేదిక ఉన్న చౌరస్తా వద్దకు దాదాపు రెండుమూడు వేల మంది వచ్చిండ్రు. దాంతో దీక్షలో కుటుంబాల వారీగా కూర్చోవడం ప్రారంభమయింది.

## ఈసారి రెబల్గా..

మళ్లీ టికెట్ యిస్తామనే హామీతో టీఆర్ఎస్లో చేరిన సోమారపు సత్యనారాయణ మమ్మల్ని పక్కనపెట్టుడు షురూ చేసిండు. మా కమిటీలను రద్దు చేసిండు. మావోళ్లను ఇబ్బంది పెట్టిండు. మనం ఉద్యమించి పార్టీలో మొదట్నుంచి ఉంటే ఇవేం అవమానాలు? ఈసారి తప్పనిసరిగా పోటీ చేయాల్సిందేనని నా సహ ఉద్యమకారులందరూ నన్ను పట్టుబట్టిండ్రు. మేం అండగా ఉంటామన్నరు. 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసే అవకాశం సత్యనారాయణకే దక్కింది. రెబల్గా నేను. మళ్లీ మా ఇద్దరి మధ్యే పోటీ. 1800 ఓట్ల తేడాతో ఓడిపోయా. 2014లోనే జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మా విజయ అత్యధిక మెజారిటీతో గెలిచింది.

## సభ్యత్వమివ్వని సోమారపు..

రెబల్‌గా పోటీ చేశాను కదా.. పార్టీలో మళ్లీ కలిసి పనిచేయడం కోసం రామన్న (కేటీఆర్) దగ్గరికి వెళితే.. సత్యనారాయణను కలువుమన్నడు. పోయి కలిస్తే పార్టీ సభ్యత్వం ఇచ్చేది లేదని తిరస్కరించాడు. కేటీఆర్‌తో చెప్పిస్తే కూడా కుదరదన్నడు. చందర్‌ను కలుపుకొని పోవాలె. ఉన్నది ఇద్దరే కదా.. అని రామన్న నచ్చజెప్పిండు సోమారపు సత్యనారాయణకు.. అయినా ఆయన వినలే. ఇదిలా నడుస్తుండగానే 2016లో జనవరి 16న విజయకు క్యాన్సర్ సోకినట్టు రిపోర్ట్స్ వచ్చాయి. లంగ్ క్యాన్సర్. దీంతో నాకు డిప్రెషన్ మొదలైంది. అటు పార్టీ సభ్యత్వం లేదు. ఇటు విజయ పరిస్థితి ఇలా.. 2015లోనే బిడ్డ పెళ్లి చేశా.. చేతిలో డబ్బుల్లేవు. గందరగోళంగా మారింది పరిస్థితి. రామన్న దగ్గరికి వెళితే ఐదు లక్షల రూపాయలకు ఎల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ఇచ్చిండు.

2016 ఫిబ్రవరిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమయింది. హైదరాబాద్‌లో సోమారపు సత్యనారాయణ ఇంటికి పోయిన. అన్నా.. మీతో కలిసి పనిచేస్తా. విజయకు క్యాన్సర్ వచ్చింది. పరిస్థితి బాగా లేదు. రాజకీయాల్లో నేను డబ్బు పెట్టే పరిస్థితి లేదు.. అని చెప్పుకున్నా. అయినా ఆయన ఒప్పుకోలేదు. ఆఖరుకు.. పది రోజులు అవకాశమివ్వు.. మావోళ్లతోని మాట్లాడి చెబుతానన్నడు. రోజూ ఫోన్ చేసేటోన్ని. ఉలుకు లేదు పలుకు లేదు. ఆఖరుకు... చందర్.. మావోళ్లు ఒప్పుకుంటలేరు. నీకు మెంబర్‌షిప్ ఇవ్వం. విజయకు మాత్రమే సభ్యత్వం ఇస్తం అని కరాకండిగా చెప్పిండు. చేసేది లేక రామన్న దగ్గరికి పోయిన. పరిస్థితి వివరించిన.. ఏం జేస్తం చందర్.. మూర్ఖుడు తయారయిండు. నేనిస్త అంటూ తనే పార్టీ సభ్యత్వమిచ్చిండు. నన్ను ఆశీర్వదించి నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించిండు. అప్పుడే నేను గట్టి నిర్ణయం తీసుకున్నా. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలె. సోమారపు సత్యనారాయణను ఓడగొట్టాలె. గెలిస్తేనే మనకు బతుకు.. ఇదే పట్టుదలతో పనిచేసిన. అయినా సత్యనారాయణ నన్ను అనేక అవమానాలకు గురి చేసిండు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నన్ను అస్సలు గుర్తించలేదాయన. ఆఖరుకు గోదావరిఖనిలో నిర్వహించిన టీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఎమ్మెల్యేగా ఆయన అందరినీ వేదికమీదికి పిలిచి, ఇన్‌చార్జినైన నన్ను మాత్రం పిలవలే. నేను మీటింగ్ పూర్తయ్యేదాకా కిందనే అందరితో పాటే కూర్చున్నా. అదీ నాలో గెలవాలన్న కసిని మరింత రాజేసింది.



### 2018 మంది తల్లులకు వారి పిల్లలతో పాదపూజ

2018లో మాతృదినోత్సవం పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అమ్మల దీవెన అందుకున్నా. 2018 మంది తల్లులను గుర్తించి, వారి పిల్లలతో వారికి పాదపూజ చేయించా. పాలతో పాదాభిషేకం చేసి పూలదండ వేశారు. అమ్మలందరికీ తలా ఒక వెండి నాణెం ఇచ్చా. చౌరస్తా వేదికగా చాలా పెద్ద కార్యక్రమం అది. దాదాపు రూ.25 లక్షలు ఖర్చు అయ్యాయి. ఇలా ప్రజలతో మమేకమవుతూ వరుసగా కార్యక్రమాలు చేస్తున్నా.

## కేసులు ఎదుర్కున్న ఉద్యమకారులకు సన్మానం

సోమారపు సత్యనారాయణ వేధింపుల క్రమంలో నాకు ఎమ్మెల్యేగా గెలవడమే ప్రధానమన్న పట్టుదల ఎక్కువైంది. నేను ఉద్యమ సమయంలో నామీద కేసులు నమోదై 50 రోజులు జైలుకు పోయిన. అప్పుడు నాతో పాటు జైలులో ఉన్న వారు, కేసులు నమోదైన వారి పేర్లతో జాబితాను తయారు చేసిన. మొత్తం 750 మంది ఉన్నట్టు లెక్క తేలింది. వారితో 2016లో



సమావేశం ఏర్పాటు చేసిన. తెలంగాణ ఏర్పాటుకు కారకులని కొనియాడుతూ అందరినీ సత్కరించా. ఉద్యమకారులం మనమైతే, రాష్ట్రం వచ్చాక ఎమ్మెల్యే సత్యనారాయణ మనకు వ్యతిరేకంగా ఉండడమేమిటని అందరూ మండిపడ్డారు. ఎమ్మెల్యే తీరుకు బాధపడ్డారు.

## 2017లో 2009 మందికి...

తర్వాత 2017 సంవత్సరం.. జేఏసీల నాయకులు, వివిధ జెండాల కింద పనిచేసిన ఉద్యమకారులదరినీ గుర్తిస్తూ ఒక లిస్ట్ ప్రిపేర్ చేశాం. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2009 మందిని గుర్తించాం. చౌరస్తా వేదికగా వాళ్లను సత్కరించాలని కార్యక్రమం ఏర్పాటు చేశాం. డిసెంబర్ తొమ్మిదో తారీకున ఉదయం నుంచి సాయంత్రం దాకా అందరికీ అదే వేదికపై సన్మానం చేసిన.

## పోటీ చేస్తనని ఎవరూ నమ్మలేదు

చందర్ దగ్గర పైసలేవ్. పోటీ చేయలేడనే కామెంట్లు వచ్చినయ్. నేను పోటీ చేస్తున్నా అని చెబితే కూడా ఎవరూ నమ్మలేదు. ఎట్టి పరిస్థితుల్లోనయినా గెలవాలనే పంతమే నాది. ఇంత పెద్ద ప్రోగ్రామ్ ద్వారా డబ్బులున్నాయి, పోటీ చేస్తడని నమ్మేలా బూస్టప్ ఇచ్చిన. 2018 డిసెంబరులో ఎన్నికల హడావిడి మొదలైంది. కేసీఆర్ సార్‌తో పాటు అందరూ రిజైన్ చేసిండ్రు. వెంటనే ప్రజా అంకితయాత్ర పేరుతో కార్యక్రమం మొదలుపెట్టినం. అర డజన్ మందితో మోటార్‌సైకిల్‌పై యాత్ర. ఎలక్షన్ తెల్లారే వచ్చినా ఎదుర్కోవాలన్న తపన నాది. ర్యాలీలు నిరంతరం సాగినయి.. 30, 40, 50, 60 రోజులు.. యాత్ర సాగుతూనే ఉన్నది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. చందర్‌గాడు అన్నంత పని చేసిండనే టాక్ వచ్చింది. నేను ప్రచారానికి పోయినపుడు ఆ తల్లులు నన్ను దీవించిండ్రు. బిడ్డా నువ్విచ్చిన వెండి బిళ్ల అట్లనే ఉంది. నీకే ఓటేస్తానని ఆశీర్వదించిండ్రు. ఈ కార్యక్రమాలు ఎన్నికల వరకే పరిమితం కాలేదు. ఏటా మదర్స్‌డే రోజు 2000 మంది తల్లులకు పాదపూజ కార్యక్రమం నిర్వహిస్తూనే ఉన్నా.

2018లో మళ్లీ సత్యనారాయణకు టికెట్ ఇవ్వొద్దని మొరపెట్టుకున్నా. ఇక్కడి అసలు సిసలు ఉద్యమకారులను, పార్టీ కార్యకర్తలను ఆయన పట్టించుకోవడం లేదని మావోళ్లందరు పార్టీ హైకమాండ్‌ను రిక్వెస్ట్ చేశారు. సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లడం లేదని చెప్పినం. ఈ సారి ఆయన గెలవలేడని వివరించినం. ఎందుకనో.. మళ్లీ సత్యనారాయణకే టీఆర్ఎస్ టికెట్ దక్కింది.

## స్వతంత్రంగానే పోటీకి నిర్ణయం

సోమారపు సత్యనారాయణకు మళ్లీ టీఆర్ఎస్ టికెట్ ఇవ్వగానే నేను డైలమాలో పడ్డా. కానీ పార్టీని విడిచిపెట్టడానికి మనసు రావడం లేదు. కాంగ్రెస్ టికెట్ ఇస్తామన్నరు. దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, వినయ్.. అందరూ పిలిచారు. పార్టీ మారబోనని వాళ్లకు స్పష్టంగా చెప్పిన. స్వతంత్రంగానే పోటీ చేద్దామని నిర్ణయించుకున్నా. నాకు జన్మనిచ్చింది తల్లిదండ్రులైతే, రాజకీయ జన్మనిచ్చింది కేసీఆర్ సార్, టీఆర్ఎస్. ఆఖరుకు కోదండరాం సార్.. ఇన్నయ్యను పంపిండు. తర్వాత ఇంటికి పిలిచిండు. కాంగ్రెస్‌తో ఒప్పందాలంటే ఎలా సార్ అని అడిగిన. లేదు చందర్ నీ కోసం రామగుండం టికెట్ మేమే తీసుకుంటమని కోదండరాం సార్ చెప్పిండు. పోటీ చేయడానికి అవసరమైన డబ్బులు కూడా ఏర్పాటు చేస్తామన్నరు. కానీ, నాకెందుకో నచ్చలేదు. మూడో రోజు రామన్న(కేటీఆర్) పిలిచిండు. చందర్.. నువ్ ఈ సారి పోటీ చేయకు.. నీకు చైర్మన్ కానీ ఎమ్మెల్సీ కానీ ఇస్తానని సార్ చెప్పమన్నడు. పోయినసారి పోటీ చేయడం వల్లే నీకు ఏదీ ఇవ్వలేకపోయినం. ఈసారి కూడా మన పార్టీయే గెలుస్తది.. అని నచ్చజెప్పిండు. అప్పటికే విజయ ఆరోగ్యం





క్షీణించింది. రూ.25 లక్షల ఎల్‌వోసీ తీసుకున్నం. కేటీఆర్ అన్న పేరుమీద, ఈశ్వర్ అన్న పేరు మీద తీసుకున్నా. రామన్న పేరు మీద మళ్లా రూ.5 లక్షల ఎల్‌వోసీ తీసుకున్నా. అన్న నచ్చజెబుతున్నడు. కానీ నేనే వినలేదు. సోమారపు సత్యనారాయణ వల్ల ఎంత అవస్థలు పడుతున్నామో గుర్తు చేసిన. నా మిసెస్ కార్పొరేటర్. ఈ రోజు వరకు కూడా ఆయన పరామర్శించలేదు. అలాంటి వ్యక్తికి ఎలా సపోర్ట్ చేయాలి అన్నా. అది అసాధ్యమైన ముచ్చట అని చెప్పేసిన. రామన్న చెప్పిండేమో... తెల్లారే సోమారపు సత్యనారాయణ మా ఇంటికొచ్చిండు. నేను అప్పుడు ఇంట్లో లేను. విజయను పరామర్శించిండు. మీ ఆయనకు చెప్పమ్మా.. నువ్ కూడా టీఆర్ఎస్సే కదా.. మద్దతివ్వమను అన్నడట. నేను నా ప్రచారం మొదలు పెట్టిన. విజయ పరిస్థితి క్షీణించడంతో హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో జాయిన్ చేసిన. ఆమెతో పిల్లలు ఉన్నరు. నేను రోజూ హైదరాబాద్‌కు, నియోజకవర్గానికి చక్కర్లు కొడుతున్నా.

## అన్ని పార్టీల నుంచి మద్దతు

ఎన్నికలకు సంబంధించి.. అన్ని పార్టీల నుంచి సపోర్ట్ దొరికింది. నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. పది రోజులైతే ఎన్నికలు. 26వ తేదీ ఆమెకు టిఫిన్ తినిపించి వచ్చిన.. మంచిగనే ఉన్నది. 27నాడు గోదావరిఖనిలో ఉన్నా. అప్పటికి బసవతారకం ఆస్పత్రిలో ఉండబట్టి 20 రోజులైంది. 28నాడు అమ్మకు బాగాలేదని పిల్లలు ఫోన్ చేశారు. వెళితే.. విజయ నామీద చెయ్యేసింది. అంతే.. ఆమె మాకు దూరమయింది. అంత్యక్రియలు, అన్ని కార్యక్రమాలు పూర్తయ్యేదాకా ప్రచారానికి తిరగలేదు. చివరికి ప్రచారానికి రెండు రోజులే మిగిలాయి. కానీ, ఆఖరుకు ఒక్కరోజే తిరగగలిగినం. అప్పటిదాకా మా ఇంట్లో పరిస్థితి, విజయకు క్యాన్సర్ అనే విషయం బయట ఎవరికీ తెలియదు. కానీ, రామన్నకు విషయం తెలిసి.. చాలా బాధపడ్డరు. రావాలనుకుంటున్నా.. పరిస్థితుల వల్ల రాలేకపోతున్నా అని మదనపడ్డరు.

నేను ఎమ్మెల్యేగా ఎన్నికయిన విషయం నా భార్యకు తెలిసుంటే బాగుండు. మాది మధ్య తరగతి కుటుంబం. ఎన్నో





స్ట్రగుల్స్ ఫేస్ చేసినం. 2009లో పోటీ చేసినప్పటి నుంచి ఆర్థికంగా, రకరకాలుగా ఇబ్బందులు. అన్నింటినీ ఓర్చుకుని నిలబడిందామె. రాజకీయంగా కూడా నాకు చాలా అండగా ఉన్నది. డివిజన్‌లో ఆమె ప్రతి ఇంటికీ ఒక కుటుంబసభ్యురాలిగా ఉండేది. అందరి ఇంటికీ పోయేది. అందరూ ఇంటికి వచ్చేవారు. రెగ్యులర్‌గా మా ఇంట్లో చాలా మందికి ఆమెనే భోజనాలు పెట్టేది. తాను కౌన్సిలర్‌గా పోటీ చేసినపుడు.. మా వదినెను మేమే గెలిపించుకుంటామని రోజుకో కాలనీ నుంచి మహిళలు వచ్చి స్వచ్ఛందంగా ప్రచారం చేసి గెలిపించారు ఆమెను. అంతటి అనుబంధం విజయది.

## కాళేశ్వరంలో పడవల పోటీలు

నేను గెలిచిన తర్వాత.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది. గోదావరిలో పడవల పోటీలు నిర్వహించా. తెలంగాణలో ఇప్పటి వరకు ఇలాంటి పోటీ ఎవరూ పెట్టనే లేదు. ఇదే మొదటిసారి. కేసీఆర్ అసెంబ్లీలో చెప్పిండు ఈ మాట. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ కార్యక్రమం ఒక ఎలివేషన్ తీసుకువచ్చింది. తర్వాత మా గోదావరి ఒడ్డున జల జాతర - జన జాతర పేరుతో 25వేల మందితో సామూహిక భోజనాల కార్యక్రమం ఏర్పాటు చేశాను.

## నేను వేరే పార్టీకి వెళ్లే ఆలోచనే లేదు

నేను గెలిచిన తర్వాత వేరే పార్టీకి పోవాల్సిన అవసరం ఏముంటది. కేసీఆర్ గారు నన్ను గుర్తుపడతరు. నన్ను రాజకీయంగా ప్రోత్సహించి వెన్నుతట్టిన పార్టీ టీఆర్ఎస్. మంత్రి, మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు గారు నాకు వెల్‌విషర్. కొప్పుల ఈశ్వరన్న మంత్రిగా ఉన్నడు. ఇన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న పార్టీని కాదని వేరే పార్టీకి వెళ్లాలన్న ఉద్దేశం




S tv SANDESH

కలలో కూడా లేదు నాకు. నేను ఉద్యమంలో ఉన్నప్పటి నుంచి కవితక్క గుర్తుపట్టి మాట్లాడుతరు. నేను పదవుల కోసమే టీఆర్ఎస్‌లోకి రాలేదు. నాకొక గుర్తింపునిచ్చిన పార్టీ అది. రాజకీయంగా జన్మనిచ్చిన తండ్రి కేసీఆర్. నేను ఎమ్మెల్యేగా గెలవగానే నేనే కేటీఆర్ గారి దగ్గరికి పోయిన. నేను గెలుస్తున్నా అని తెలవగానే ఓ టీమ్‌తోని ముందే చెప్పి పెట్టిండ్రు.

## కేటీఆర్‌పై సోమారపు అసత్య ప్రచారం

ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. ఎన్నికల సమయంలో.. సోమారపు సత్యనారాయణ.. తాను ఓడిపోతున్నానని తెలిసి ఒక రూమర్ క్రియేట్ చేసిండు. చందర్‌కు కేటీఆర్ సపోర్ట్ చేస్తున్నడనేది ఆ ప్రచారం. అక్కడితో ఆగకుండా కేటీఆర్‌తోని కూడా ఒక మీటింగ్ పెట్టాలని కేసీఆర్‌తోని చెప్పారు. అప్పటికే కేసీఆర్ సభ జరిగినా మళ్లీ కేటీఆర్ సభకు పట్టుబట్టారు. కేటీఆర్ సభకు కొన్ని గంటలు ముందే విజయ చనిపోయింది. విషయం తెలిసి కేటీఆర్.. తాను రాలేకపోతున్నానని అప్పటి హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్‌తో ఫోన్‌లో చెప్పించిండు. ఎందుకంటే ఎన్నికల పరంగా ప్రత్యర్థిని. లేదంటే నేరుగా మా ఇంటికి వచ్చేవారు. గతలో మా ఇంటికి రామన్న, కవితక్క వచ్చిన విషయం అందరికీ తెలిసిందే.

## పెద్ద ఎత్తున ఉత్సవాలు

ఈశ్వరన్న గోదావరిఖనిలో అమ్మవారి దేవాలయం నిర్మించిండు. ఇప్పుడు శ్రీరామపాదక్షేత్రంలో వెంకటేశ్వరస్వామి గుడిని కట్టేందుకు ప్లాన్ చేసినం. కేసీఆర్ బర్త్‌డే రోజు భూమి పూజ చేసినం. పోయినసారి కేసీఆర్ గారి బర్త్‌డే సందర్భంగా శ్రీనివాస కల్యాణం నిర్వహించినం. 6,700 మందితో కోలాటం ప్రదర్శన ఏర్పాటు చేసినం. ప్రతి ఏడాది మహాశివరాత్రి జాగరణ మహోత్సవం నిర్వహిస్తున్నాం. తెల్లారేదాకా సాంస్కృతిక కార్యక్రమాలు సాగుతూనే ఉంటాయి.





## బాలల దినోత్సవం..

నవంబర్ 14న బాలోత్సవం నిర్వహిస్తాం. అది కూడా మూడు రోజులు. నియోజకవర్గంలో ఉన్న పాఠశాలలన్నీ పాల్గొన్నయ్. దానికి తెలంగాణ బాలోత్సవం అని పేరు. మా స్టేడియం గ్రౌండ్‌లో ఆరు స్టేజీలు. ఒక్కో దానిపై ఒక్కో సాంస్కృతిక కార్యక్రమం. అన్నీ ఒకేసారి కొనసాగుతూనే ఉంటయ్. దసరా ఉత్సవాలు కూడా పెద్ద ఎత్తున చేస్తం. రావణాసుర వధ.. టపాసులతో రెండు గంటలపాటు నాన్‌స్టాప్ షో. ఇక్కడ కార్మిక దినోత్సవం అయిన మేడే కూడా పెద్దఎత్తున సాగుతుంది.




## గాయకులతో 125 పాటల కార్యక్రమం

కళాకారులందరూ తలా ఒక పాట పాడేలా.. 125 పాటల కార్యక్రమం నాన్‌స్టాప్‌గా సాగింది. వరల్డ్ రికార్డు అది. మహిళల కోసం మహిళా ప్రతిభోత్సవం... కేటీఆర్ అన్న బర్త్‌డే సందర్భంగా చేసినం. చాలా డిఫరెంట్ ప్రోగ్రామ్స్.. ఇంకా చాలానే చేసినం. నా ఉద్దేశ్యం ఏంటంటే.. ఏది చేసినా బోర్ కొట్టొద్దు. ప్రజలందరూ ఎంజాయ్ చేయాలె. సొంతమనుకుని ఇన్వాల్వ్ కావాలె. అన్ని ప్రోగ్రామ్స్ డిజైన్ చేసింది నేనే. అది నాకు హ్యాపీ.

## ఎమ్మెల్యేగా సంతోషం...

ఎమ్మెల్యేగా నాకు సంతోషాన్నిచ్చిన విషయం నేను గోదావరిఖనికి మెడికల్ కాలేజీ సాధించడం. ఓ దగ్గర రైల్వే బ్రిడ్జి కట్టించిన.. దాంతో ట్రాఫిక్ సమస్యలు క్లియర్ అయ్యాయి. నా హయాంలోనే ఓ కోర్టు వచ్చింది. సివిల్ జడ్జి కోర్టు వచ్చింది. ఎవరైనా చనిపోతే అంతిమయాత్రకు వారి కుటుంబసభ్యులు ఇబ్బందులు పడకుండా ఉచితంగా అంతిమయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించిన. రామగుండం నియోజకవర్గంలో చాలా అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. పేరుకే పారిశ్రామిక ప్రాంతం. ఉన్నవన్నీ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలు. స్థానికులకు ఉద్యోగావకాశాలు తక్కువ. ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. అందుకే ఐటీ పార్క్ పెట్టాలనేది నా ఆలోచన. ఇండస్ట్రియల్ పార్క్ కూడా. పెట్టి తీరుతాం. వీటికి సంబంధించిన చర్చలు నడుస్తున్నయ్. మంత్రి కేటీఆర్ గారు ఒప్పుకున్నరు.

## కేటీఆర్ గోల్డ్‌కప్

ప్రతి సంవత్సరం కేటీఆర్ గోల్డ్‌కప్ పేరుతో నియోజకవర్గ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ పెడుతున్నం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నం.





S tv SANDESH



## నాలుగు గ్రామాల విలీనం రద్దు

ఇంకా తృప్తికరమైన పనేంటంటే.. నా నియోజకవర్గంలో నాలుగు గ్రామాలు విలీనమయ్యాయి. ఇవి మున్సిపల్ పరిధిలో ఉన్నాయి కాబట్టి గ్రామపంచాయతీ ఎన్నికలు కాలేదిక్కడ. మున్సిపల్‌లో కలిస్తే వంద రోజుల పని ఇచ్చే ఉపాధిహామీ బంద్ అవుతుంది. అందుకే ఆయా గ్రామాల ప్రజలు రిక్వెస్ట్ చేసిండ్రు. ఎలాగైనా మళ్లీ గ్రామపంచాయతీగానే ఉండాలని. కేసీఆర్ సార్ దగ్గరికి వెళ్లి మాట్లాడిన.. మొత్తం 133 గ్రామాలు విలీనమైతే.. ఆ నాలుగు గ్రామాలకు మాత్రం మినహాయింపు ఇవ్వాలని కోరిన. సార్ నా మాటను మన్నించిండ్రు. గ్రామాల విలీనాన్ని రద్దు చేసిన చరిత్రే లేదు. ఇదే మొదలు. కేసీఆర్ గారికి నామీదున్న నమ్మకానికి ఇదీ నిదర్శనం. సార్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటా.

## పల్లెనిద్ర, బస్తీనిద్ర, మార్నింగ్‌వాక్, బాయిబాట

ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి పల్లెనిద్ర, బస్తీనిద్ర, మార్నింగ్‌వాక్, బాయిబాట అనే కార్యక్రమాలను నిర్వహిస్తున్నా. ప్రతీరోజు ప్రజలను కలిసి సమస్యలను తెలుసుకుంటున్న. అధికారులను అక్కడికే పిలిపించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్న. మార్నింగ్‌వాక్ పేరుతో పట్టణంలోని 50 వార్డుల్లో ప్రతీరోజు ఒక వార్డులో తనిఖీ చేస్తున్న. సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్న. బాయిబాటలో భాగంగా బొగ్గుబాయిలను సందర్శించి కార్మికుల సమస్యలను తెలుసుకుంటున్న. తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గారి మార్గదర్శనంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న. కార్మికులు తెలిపిన సమస్యలపై జీఎం, సింగరేణి బోర్డు సభ్యులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేస్తున్న. సమస్యల స్థాయిని బట్టి ఉన్నతాధికారులు, సీఎండీ శ్రీధర్ లేదా అధ్యక్షురాలు కవిత, సీఎం గారి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తున్న.





## కరోనా బాధితుల కోసం భరోసా యాత్ర

కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో లాక్‌డౌన్ అమలులో ఉన్న విషయం అందరికీ తెలిసిందే. అప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా భరోసాయాత్ర నిర్వహించిన. ప్రతీరోజూ కరోనా బాధితులను కలుసుకుని ధైర్యం చెప్పేవాడిని. కరోనా వైరస్ సోకిందని బాధితులను వారి కుటుంబసభ్యులే దూరం పెడితే, నేను వెళ్లి వారికి ధైర్యాన్నిచ్చాను. పౌష్టికాహారం, మందులు అందజేసిన. ఇలా నేను సుమారు 1200 మంది కరోనా వ్యాధిగ్రస్తులను స్వయంగా కలవడం జరిగింది. ఇల్లు లేని బాధితుల కోసం కరోనా కేర్ సెంటర్‌లను ఏర్పాటు చేయించిన. ఆ



క్వారంటైన్ కేంద్రంలో రోగులకు అవసరమైన భోజనం, మందులు, డ్రైఫ్రూట్స్ తదితర అవసరాలను విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తీర్చినం. లాక్‌డౌన్ బాధితులను ఆదుకునేందుకు సరుకుల పంపిణీ చేపట్టినం.

## యాష్‌పాండ్ ఇబ్బందులు దూరం

కుందనపల్లి గ్రామంపై ఎన్‌టీపీసీ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్‌కు సంబంధించి, విద్యుదుత్పత్తిలో వెలువడిన బూడిద, ఇతర వ్యర్థజలాలను ఈ గ్రామంలో ఉన్న చెరువులో కుమ్మరిస్తారు. దీంతో ఇక్కడి భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. ఈ చుట్టుపక్కల ఎక్కడ బావులు, బోర్లు తవ్వినా కలుషిత జలాలు వస్తుంటాయి. ఎండాకాలం వచ్చిందంటే ఇక్కడ నరకంగా ఉంటుంది. యాష్‌పాండ్‌లోని బూడిద ఎండిపోయి గాలిలో తేలుతుంటుంది. గాలి కలుషితమవడమే కాకుండా గ్రామాన్ని కప్పేస్తుంది. చాలా మంది ఊపిరితిత్తులు, కిడ్నీ సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ జబ్బులతో ఇక్కడ ఇప్పటికి 42 మంది ప్రాణాలు కోల్పోయారు. అందుకే గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించి పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా. అంతేకాకుండా ఎన్‌టీపీసీ



యాజమాన్యంతోనూ పలుమార్లు మాట్లాడడం జరిగింది. ఎన్‌టీపీసీ కేంద్ర ప్రభుత్వ సంస్థ కావడంతో ఢిల్లీకి వెళ్లి సంబంధిత అధికారులకు విన్నవించాను కూడా. అధికారులు ఇంకా తేల్చడం లేదు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెబుతున్నారే తప్ప ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గట్టిగా నిలదీస్తే ప్రభుత్వ నిబంధనలు, కాలుష్యనియంత్రణ మండలి నిబంధనల మేరకే తాము కార్యకలాపాలు చేపడుతున్నామని ఎన్‌టీపీసీ బదులిస్తున్నది. దీంతో కుందనపల్లి గ్రామస్థులతో కలిసి అయ్యప్పదీక్షలో ఉండగానే 20 కిలోమీటర్ల దూరం పాదయాత్రగా జిల్లా కేంద్రానికి వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాను. కలెక్టర్... ఎన్‌టీపీసీ, పీసీబీ అధికారులను పిలిపించారు. అయినా వారి సమాధానంలో మార్పు రాలేదు.

## పట్టణంలో రోడ్ల విస్తరణ

గోదావరిఖని పట్టణంలో రెండు దశాబ్దాలుగా మరమ్మతుకు నోచుకోని రమేష్‌నగర్-ఎల్బీనగర్ రోడ్డును విస్తరించి పునర్ నిర్మించడానికి నిధులు కేటాయించడమే కాకుండా దగ్గరుండి మరీ పనులు పూర్తి చేయించాను. ఈ రోడ్డు పూర్తి కావడం వల్ల ప్రజలకు చాలా వరకు రవాణా కష్టాలు






తగ్గిపోయాయి. ఇక మున్సిపల్ ఆఫీసు మొదలుకొని.. టీ-జంక్షన్, 5-ఇన్‌క్లైన్ వరకు 2 కిలోమీటర్ల రోడ్డును విస్తరించడం జరిగింది. మార్కండేయ కాలనీ నుంచి గౌతమీనగర్ వరకు ఎఫ్‌సీఐ వెళ్లే దారిలో కొత్త రోడ్డును నిర్మించడం జరిగింది. ఎన్టీపీసీ మెయిన్‌గేటు నుంచి గౌతమీనగర్ వరకు రోడ్డును విస్తరించి పునర్నిర్మించడం జరిగింది.

## కమ్యూనిటీ హాళ్లకు ప్రాధాన్యం

మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి పలు కమ్యూనిటీ హాళ్లను నిర్మించడం జరిగింది. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్, రెడ్డి కుల సంఘం, పద్మశాలి, కాపు కుల సంఘాలకు ప్రభుత్వ నిధులను ఇప్పించడంతో పాటు అవసరమైన చోట ఎమ్మెల్యే నిధులను అందజేస్తున్నా. మల్కాపూర్ గ్రామపరిధిలో రూ.5 కోట్లతో అంబేద్కర్ విజ్ఞానకేంద్రాన్ని నిర్మిస్తున్నాం. కొప్పుల ఈశ్వరన్న దీనికి శంకుస్థాపన చేశారు. పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే వారి కోసం ఈ విజ్ఞానకేంద్రంలో ప్రత్యేకంగా స్టడీరూంలు నిర్మించడంతో పాటు అన్ని పరీక్షలకు సంబంధించిన మెటీరియల్, పుస్తకాలు అందుబాటులో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసినం.

ఫైవ్ ఇంక్లైన్ గనికి ఓపెన్‌కాస్ట్‌ను ఏర్పాటు చేశారు. దాని పక్కనే ముస్లింల ఈద్గా, శ్మశానవాటికలకు సంబంధించి కొంత స్థలం పోతున్నది. వారికి పక్కనే ఉన్న స్థలాన్ని కేటాయించాలని ముస్లిం మత పెద్దలతో కలిసి సింగరేణి జీఎం, డైరెక్టర్ బలరాంనాయక్‌తో చర్చలు జరిపాను. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాను కూడా. త్వరలోనే దీనికి సంబంధించి సానుకూల నిర్ణయం వచ్చే అవకాశం ఉన్నది.

కేంద్ర ప్రభుత్వం సింగరేణిలోని ఓపెన్‌కాస్టు గనుల వేలానికి పిలుపునిచ్చింది. వేలం వల్ల గనులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉన్నది. అదే గనుక జరిగితే కార్మికుల హక్కులు అమలులో ఉండవు. అందుకే గనులను వేలం చేయడానికి వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేపట్టినం.










## అందుబాటులోకి సివిల్ కోర్టు

గోదావరిఖనిలో సివిల్ కోర్టు లేకపోవడంతో పెద్దపల్లిలోని కోర్టుకు వెళ్లాల్సి వచ్చేది. వాయిదాలున్నప్పుడు 30 కిలోమీటర్లు ప్రయాణించి పెద్దపల్లికి వెళ్లడం బాధితులకు ఇబ్బందికరంగా ఉండేది. దీంతో నేను సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయించాను. ప్రస్తుతం రామగుండం మున్సిపల్ ఆఫీసులో తాత్కాలికంగా కొనసాగుతున్నది. నూతన కోర్టు భవన నిర్మాణానికి సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయి. త్వరలోనే అందుబాటులోకి వస్తుంది.

హైదరాబాద్ నుంచి గోదావరిఖని వరకు ఉన్న రాజీవ్‌రహదారిపై కుందనపల్లి దగ్గర పెట్రోల్‌బంకులు ఉన్నాయి. అక్కడే రైల్వే అండర్‌బ్రిడ్జి ఉన్నది. అటవీ, రైల్వే శాఖల అనుమతులు లేకపోవడంతో ఈ రహదారిని రెండు లేన్లుగా విస్తరించడం జరగలేదు. ఎనిమిదేళ్లుగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై హైదరాబాద్‌కు చాలాసార్లు వెళ్లి అధికారులతో చర్చించి అనుమతుల కోసం కృషి చేశాను. ఇక్కడ రోడ్డు విస్తరణ జరిగింది. ప్రజల ఇబ్బందులు తీరినయ్.

## ఎన్‌టీపీసీ కార్మికుల సమస్యలపై పోరాటం





ఎన్‌టీపీసీ కాంట్రాక్టు కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. 40 సంవత్సరాలు నిండిన కార్మికులను మెడికల్ పరీక్షలకు పంపి, వివిధ కారణాలతో తొలగించేవారు. కానీ, వారి స్థానంలో నామినీలకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. వారికి న్యాయం జరగాలని పోరాడుతున్నం. తొలగించబడిన వారు సూచించిన వ్యక్తులకు ఉద్యోగాలు ఇవ్వాలని, హైపవర్ కమిటీ సూచించిన వేతనాలు అమలు చేయాలనేది మా డిమాండ్. కార్మికుల తరఫున హైదరాబాద్‌లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించడం జరిగింది. ఎన్టీపీసీ ఉన్నతాధికారులతోనూ పలుమార్లు చర్చించిన. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌టీపీసీ లేబర్ గేటు వద్ద నిరాహారదీక్ష కూడా చేసినం.





## తీరిన మెడికల్ కాలేజీ కల

గోదావరిఖని ప్రజల దశాబ్దాల కల మెడికల్ కాలేజీ. ఇక్కడ కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ, ఎన్‌టీపీసీ, సింగరేణి బొగ్గుగనులు, ఒపెన్‌కాస్ట్ గనులు, జెన్‌కోతో పాటు రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిశ్రమ కూడా ఉన్నది. ఈ కంపెనీలన్నీ బొగ్గుతో నడిచేవి కావడంతో విపరీతమైన కాలుష్యం వెలువడుతున్నది. కంపెనీల నుంచి వెలువడే వ్యర్థ జలాలను గోదావరి నదిలోకి వదడంతో జలాలు కలుషితమవుతున్నాయి. జల, వాయి కాలుష్యంతో స్థానికులు అనేక రోగాలకు గురవుతుంటారు. ఓపెన్‌కాస్టు మైన్స్, రద్దీ రోడ్ల కారణంగా ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో క్రిటికల్ కేసులు, ఉన్నతస్థాయి వైద్యం అవసరమైనప్పుడు హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తున్నది. నాలుగైదు గంటలు ప్రయాణం చేసి హైదరాబాద్ చేరుకునే లోపే చాలా మంది మరణిస్తున్నారు. హైదరాబాద్ దాకా వెళ్లలేని వారి పరిస్థితి










దారుణం. ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందే. ఇక్కడ మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు అవసరమున్నది. ఇటీవల సీఎం కేసీఆర్ సార్ ఏడు జిల్లా కేంద్రాలకు మెడికల్ కాలేజీలు ప్రకటించారు. రామగుండం జిల్లా కేంద్రం కాకపోవడం వల్ల ఆ అవకాశం రాలేదు. దీంతో సీఎం గారికి పరిస్థితిని వివరించి, ఒప్పించి మెడికల్ కాలేజీని మంజూరు చేయించాను. నిధుల కోసం సింగరేణి నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ కేటాయించాలని ఆ సంస్థ అధికారులతో చర్చించడమే కాకుండా ఒప్పించాను కూడా. రూ. 500 కోట్లకు సంబంధించి చెక్కును సింగరేణి సీఎండీ సీఎం కేసీఆర్ గారికి అందజేశారు. మెడికల్ కళాశాల భవనం పనులు శరవేగంగా సాగుతున్నాయి. తాత్కాలికంగా తరగతులు



ప్రారంభించేందుకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భవనంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## విజయమ్మ ఫౌండేషన్

నా భార్య విజయ పేరుతో విజయమ్మ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశాం. ప్రధాన కార్యాలయం మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఉంటుంది. మహిళల సాధికారతే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ ఫౌండేషన్‌కు అన్ని డివిజన్లలో కేంద్రాలను నెలకొల్పినం. ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు సుమారు 200 మందికి పెళ్లిళ్లు చేసినం. ఎవరైనా పేదలు పెళ్లి పత్రిక తీసుకుని వస్తే వారికి విజయమ్మ ఫౌండేషన్ తరఫున మంగళసూత్రాలు, మట్టెలు, ఆర్థిక సాయం అందజేస్తున్నం.

మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడేలా ఉండాలని కుట్టు శిక్షణ ఇప్పించాలని సంకల్పించి 78 కేంద్రాలను ఏర్పాటు చేసినం. ఒక్కో సెంటర్‌లో 10 నుంచి 20 మంది బట్టలు కుట్టడం నేర్చుకుంటున్నారు. రెండు నెలలపాటు శిక్షణ ఉంటుంది. ట్రెయినింగ్ పూర్తయ్యాక వారికి కుట్టుమిషన్ కూడా యిస్తున్నాం. ఇప్పటి వరకు 2005 మంది శిక్షణ తీసుకున్నరు. వీరిలో 600 మందికి మిషన్ల పంపిణీ పూర్తయింది. మిగతా వారికి అందించే ఏర్పాటు చేస్తున్నం. దీంతో పాటే బ్యూటీషియన్, మగ్గం వర్క్‌లో కూడా మహిళలకు శిక్షణ అందిస్తున్నాం.

గోదావరిఖని పట్టణానికి నియోజకవర్గ వ్యాప్తంగా పలు



గ్రామాల నుంచి వైద్యం కోసమో, ఇతరత్రా పనుల కోసమో నిత్యం వేలాది మంది వస్తుంటారు. అరకొర డబ్బులతో పట్టణానికి వచ్చేవారు చాలా మంది పగటిపూట పస్తులుండి ఏ రాత్రికో ఇంటికి చేరేదాకా ఆకలితో ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి వారి కోసమే కాకుండా, ఎవరూ లేని, ఏ ఆసరా లేని వారి కోసం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించినం. ప్రతి రోజు 150 మందికి తక్కువ కాకుండా మా ఫౌండేషన్ తరఫున అన్నం పెడుతున్నం. గోదావరిఖనిలోని పోచమ్మ దేవాలయ ఆవరణలో నిత్యం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నది. ప్రభుత్వ ఆస్పత్రిలో పేషంట్‌తో పాటు వచ్చే సహాయకులకు భోజనం అందిస్తున్నాం. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స చేయించుకునే స్తోమత లేని వారికి ప్రభుత్వ సాయం ఇప్పించడంతో పాటు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం నగదును అందజేస్తున్నాం.

ఇప్పటి వరకు ఇదంతా దాతల సహాయం లేకుండానే సాగుతున్నది. ఎవరైనా, ఎప్పుడైనా ముందుకు వచ్చి తమ పేరిట ఒక రోజు భోజనం పెట్టమంటే పరిశీలిస్తాం. దీంతో పాటు మా ఫౌండేషన్ తరఫున విజయమ్మ నిలయం పేరిట ఇళ్లను నిర్మిస్తున్నా. నిరాశ్రయులైన వారికి గూడు కల్పించడమే మా ధ్యేయం.

## ఆరువేల మంది పేదలకు హెల్త్‌కార్డ్స్

విజయమ్మ ఫౌండేషన్‌తో చేస్తున్న గొప్ప కార్యక్రమం హెల్త్‌కార్డ్స్. సుమారు ఆరువేల మంది పేదలకు ఈ హెల్త్‌కార్డ్స్ ఇచ్చినం. రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డాక్టర్లందరిని సంప్రదించి ఈ ఏర్పాటు చేసినం. మా ఫౌండేషన్ అందించే హెల్త్‌కార్డు తీసుకుని వైద్యం కోసం ఆ డాక్టర్ల దగ్గరకు వెళ్లిన వారికి సగం కన్నా తక్కువ ఫీజు తీసుకుంటారు. అంటే ఒక డాక్టర్ జనరల్‌గా రెండు వందలో, రెండు వందల యాభయ్యో ఫీజు తీసుకుంటే.. మా హెల్త్‌కార్డ్ తీసుకుని వెళ్లిన వారి నుంచి కేవలం రూ.100 ఫీజు తీసుకుంటారు. టెస్టులు చేయాల్సి వస్తే 50 శాతం డిస్కౌంట్ ఇస్తారు. మందులపై పది శాతం రాయితీ. కార్డు అందుకున్న ఒక కుటుంబంలో ఎంత మంది ఉన్నా వారందరికీ ఇదే వర్తిస్తుంది. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు తీసుకెళ్లడంలో ఎదురయ్యే ఇబ్బందులను నివారించేందుకు మా ఫౌండేషన్ తరఫున ఒక వైకుంఠరథాన్ని తీసుకొచ్చినం. అంతే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలు అవసరమైతే ఆగమేఘాలపై ఆస్పత్రికి చేర్చేందుకు ఒక అంబులెన్స్‌ను అందుబాటులోకి తెచ్చాం. ఈ సేవలన్నీ ఉచితమే.

## పేదింటి కుసుమాలను చదివిస్తున్నా..

బోనగిరిలో మేం ఐటీఐ చేస్తున్నపుడు శేషాలు అనే ఫ్రెండ్ ఉంటుండె. అక్కడ మాకు కేబుల్ వ్యాపారం కూడా ఉండేది. దాంతో నెలలో ఒకటి రెండుసార్లు నేను, మా బావమరిది, రాజేష్ బోనగిరికి వెళ్తుండే వాళ్లం. అక్కడి వివేరా హోటల్‌కు







వెళ్లినపుడల్లా హోటల్ యాజమాన్యం, అక్కడ పనిచేసే పిల్లలు పలకరించేవారు. అక్కడ గోదావరిఖని కల్యాణ్‌నగర్‌కు చెందిన పిలగాడొకడు పని చేస్తున్నడని మాకు చెప్పిండ్రు. పిలిచి మాట్లాడినం. పేరు నిమ్మల ప్రవీణ్‌కుమార్‌గౌడ్. బోనగిరిలో బీసీఏ సీటు వచ్చింది. ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలేజీలో చేరిండు. ఫీజులు



కట్టే స్తోమత లేక హోటల్‌లో పని చేస్తున్నడు. చదువంటే ఆసక్తి ఉన్నది. కానీ పరిస్థితులు అనుకూలంగా లేవు. అందుకే ఆర్థికంగా సపోర్ట్ చేయడం మొదలుపెట్టినం. ఎంబీఏ తర్వాత ఆక్స్‌ఫర్డ్‌లో చదవాలని ఉందన్నడు. మాస్టర్స్ కోసం ఎంట్రన్స్ రాసిండు. హైదరాబాద్‌లో రూము కేటాయించి, డబ్బులిచ్చి అవసరమైన శిక్షణ యిప్పించినం. అమెరికాలోని యూనివర్సిటీలో అడ్మిషన్ కన్‌ఫామ్ అయింది. బ్యాంక్ లోన్ రాకపోతే కొంత డబ్బు పోగు చేసి అమెరికాకు పంపించినం. మంచిగ సెటిల్ అయ్యిండక్కడ. నా సొంత తమ్ముడి లెక్క. రెగ్యులర్‌గా ఫోన్‌లో టచ్‌లో ఉంటడు. ఎప్పుడు ఇండియా వచ్చినా ఇంటికొస్తడు. ఇలా చాలా మంది పిల్లలను చదివించాను.

## కార్యకర్త మనసు తెలిసినవాడిని

ఒక కార్యకర్త తన నాయకుడి నుంచి ఏం కోరుకుంటాడో నాకు బాగా తెలుసు. ఏ ఆలోచనతో వస్తున్నడు, మనసులో ఏముంటది, ఇంటికి పిలిస్తే ఏమనుకుంటడు, వాళ్లింటికి వెళితే ఎలా ఫీలవుతాడు.. అవన్నీ నాకు తెలుసు. ఎందుకంటే నేను కార్యకర్తగానే జీవితం మొదలుపెట్టిన వాడిని. ఈశ్వరన్నతో ఉన్నపుడు నేనేం ఆలోచించానో నాకు బాగా తెలుసు. అందుకే ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటా. ప్రతి కార్యకర్తను





తొలినాళ్లలోని నన్ను చూసుకుంటా.

## మంచి పని చేయాలె.. రిజల్ట్ అదే వస్తది

మేం తెలంగాణ ఉద్యమంలో ఉన్నపుడు ఎన్నో అవమానాలు ఎదురయ్యాయి. వీడికి తెలంగాణ పిచ్చి పట్టింది అన్నరు. కుటుంబంతో సంతోషంగా ఉండక ఇదేం తిరుగుడని అన్నారు. కానీ విజయ, నేను ఇద్దరం టీఆర్ఎస్‌లో చేరినప్పటి నుంచి ప్రజల్లోనే ఉన్నం. ఉదయం 8 గంటలకు ప్రజల్లోకి వెళితే రాత్రి మళ్లీ 11 గంటలయ్యేది. మధ్యాహ్నం కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసిన సందర్భాలు చాలా తక్కువ. ఆఖరుకు తెలంగాణ కోసం త్యాగం చేసిన కుటుంబమని గుర్తించారు. కోరుకంటి చందర్‌ను గెలిపించాలనే నిర్ణయానికి వచ్చారు. రాష్ట్రం వచ్చింది. ఎమ్మెల్యేగా కూడా గెలిచాను. ఇప్పుడు నా కర్తవ్యం పని చేసుకుంట పోవడమే. మంచిపని చేస్తే ఫలితం బాగుంటదని నా నమ్మకం. నా జీవితం ప్రజలకే అంకితం. రామగుండం నియోజకవర్గాన్ని ఉత్తమమైనదిగా, అన్ని వసతులున్న ప్రాంతంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. మీ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుతూ..

- మీ

**కోరుకంటి చందర్**













TRS


TRS














EXPLOSIVES


సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధిద్దాం
పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
RMC
రామగుండం నగరపాలక సంస్థ




4K రన్


కాళేశ్వర ప్రాజెక్టు నీటితో..
అమరవీరుల స్థూపానికి
జలనీరాజన
ఎదురీదిన KCR గారికి జేజేలు


EXTERNAL STUDIES & RESEARCH

ఈ అగ్నిగుండాల కన్నా మానవకల్పిత గండాలే మహాచెడ్డవి
అవమానించిన వ్యక్తుల కన్నా ఈ నిప్పుకణికలు మహాగొప్పవి
నన్ను నమ్మి ఓటేసి గెలిపించిన ప్రజలు నా మొదటి దేవుళ్లు.
నాకు రాజకీయ జీవితాన్నిచ్చిన తండ్రి కేసీఆర్.
వీళ్లందరూ బాగుండాలి. ఈ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి. కుట్రలు, గండాలు,
అవమానాలు, కష్టాలు లేని జీవితాన్ని ప్రజలందరూ అనుభవించాలి.
అందుకే నిప్పులపై ఈ నడక. అమ్మవారి సాక్షిగా లోక కల్యాణం కోసం ఈ తపన.

**- కోరుకంటి చందర్**, రామగుండం ఎమ్మెల్యే



